సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 21 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.21,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21,500 పలికాయి. మార్కెట్‌కు 232 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.21
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.21, కనిష్టంగా రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/23.4°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

వక్క మార్కెట్‌కు స్థల పరిశీలన



స్థలానికి సంబంధించిన మ్యాప్ పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

అమరాపురం: వక్క రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోదాము, వక్క మార్కెట్ భవన నిర్మాణాల కోసం మండలంలోని హలుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కాచికుంట, హలుకూరు గ్రామ సమీపంలోని స్థలాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మారుతి ప్రకాష్, ఆర్‌ఐ గిరియప్ప, సర్వేయర్లను వివరాలు ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకూడదన్నారు. ప్రజలు ఏదైనా సమస్య గురించి తెలిపినప్పుడు కచ్చితంగా వాటిని పరిష్కరించాలని సూచించారు.

'ఉత్తమ' అవార్డుకు 26లోపు దరఖాస్తు చేసుకోవాలి

పుట్టపర్తి: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోధనలో కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు, క్రమశిక్షణ చర్యలు ఉండకూడదన్నారు. అర్హులైన వారు పూర్తి చేసిన దరఖాస్తుల రెండు సెట్లను 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఎంఈఓ/డీవైఈఓలకు అందజేయాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను వారు పరిశీలించి రిమార్కులు నమోదు చేసి ఈ నెల 28వ తేదీ డీఈఓ కార్యాలయంలో అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌పై కేసు నమోదు

తాడిపత్రి రూరల్: స్థానిక గన్నెవారిపల్లి కాలనీలో ఉన్న వెంకటసాయి ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్, ప్రిన్సిపాల్ నారాయణస్వామిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ రూరల్ ఎస్‌ఐ కాటమయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తాడిపత్రిలోని సర్ సీవీ రామన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విజయ్‌కుమార్, వంశీ పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించి, డ్రా చేశారు. ఈ క్రమంలో వారి వివరాలను పొందుపరిచి వెంకటసాయి ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు చూపిస్తూ పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌కు ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ దరఖాస్తు చేశారు. దీనిపై సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుధాకర్‌తో పాటు నారాయణస్వామిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మైక్రో జలగలు



హిందూపురం మండలంలోని ఓ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన పది మంది మహిళలు ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థ వద్ద రూ.10 వేల చొప్పున రూ.లక్ష రుణం తీసుకున్నారు. అయితే గ్రూపులోని ఓ సభ్యురాలి భర్తకు ఆరోగ్యం సరిగా లేక బెంగళూరు వెళ్లింది. సకాలంలో స్వగ్రామానికి రాలేదు. దీంతో ఆమె చెల్లించాల్సిన కంతు మిగిలిన సభ్యులు కట్టి వెళ్లాలని మైక్రో ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు తెలపగా, గ్రూపులోని ఓ మహిళ ముందుకు వచ్చి ఆ మొత్తం కట్టేసింది. సదరు మహిళ తిరిగి బెంగళూరు నుంచి వచ్చినా కంతు మొత్తం చెల్లించలేకపోయింది. దీంతో గ్రూపు సభ్యులంతా ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. దీంతో ఆమె జీవనాధారమైన పాడి ఆవును విక్రయించి కంతు చెల్లించింది.

✧ చిలమత్తూరు మండలంలోని ఓ తండాలోని గ్రూపునకు మైక్రో ఫైనాన్స్ సంస్థ రూ.50 వేల రుణం ఇచ్చింది. నెలరోజుల్లో చెల్లించాలని గడువు విధించింది. అయితే సకాలంలో రుణ మొత్తం చెల్లించని కారణంగా రెండోనెలలో ఏకంగా రూ.10 వడ్డీతో అసలు, వడ్డీ వసూలు చేసుకున్న మైక్రో ఫైనాన్స్ సంస్థ ఏజెంట్లు...మళ్లీ రుణం ఇచ్చేది లేదని చెప్పారు.

✧ లేపాక్షి మండల కేంద్రంలోని ఓ దుకాణదారునికి రూ.లక్ష అప్పుగా ఇచ్చిన మైక్రో ఫైనాన్స్ సంస్థ రెండు నెలలకు ఏకంగా రూ. 8 వేల వడ్డీ వసూలు చేసింది. అలాగే ఏజెంట్లు రాను పోను ఖర్చుల కోసం రూ.500 అతని నుంచే అదనంగా వసూలు చేశారు.

..ఇలా జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. నిరుపేద, మధ్యతరగతి వాసుల అవసరాలను ఆసరాగా చేసుకుని అప్పులిచ్చి...అనక అందిన కాడికి దండుకుంటున్నాయి.

- జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా మైక్రో ఫైనాన్స్ సంస్థలు
- అధిక వడ్డీలతో పేదల రక్తాన్ని పీలుస్తున్న వైనం
- అవసరాన్ని ఆసరా చేసుకుని వడ్డీ వసూలు
- గడువులోపు వడ్డీ కట్టకపోతే గ్రూపు సభ్యులతో వేధింపులు

హిందూపురం అర్బన్: జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. పేదలకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చి వారిని ఆర్థికంగా ఆదుకుంటామంటూ గొప్పలు చెబుతూ అందిన కాడికి దోచేస్తున్నాయి. అవసరాన్ని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకొంటున్నాయి. ఊరూరా ఏజెంట్లను నియమించుకుని వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. బ్యాంకు కంటే తక్కువ వడ్డీ అంటూ నిరుపేదలకు ఆశ జూపి అప్పు తీసుకున్న రోజు నుంచి వివిధ రకాల వడ్డీలతో నిరుపేదలను జలగల్లా పీల్చేస్తున్నాయి.

నిషేధం విధించినా...

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కొన్ని మైక్రో ఫైనాన్స్‌లపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా రహస్యంగా రుణాలు ఇవ్వడం, ఏజెంట్ల ద్వారా వసూళ్లు చేస్తున్నాయి. పేదల అవసరాలే ఆసరాగా సదరు సంస్థలు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయి. ఎవరైనా సకాలంలో కంతు చెల్లించని పక్షంలో ఏజెంట్ల బెదిరింపులు అన్నీ అన్నీకావు. గతంలో మహిళలు ఎదురు తిరగడంతో కొంతకాలం కార్యకలాపాలు నిలిపివేసిన మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు ఇప్పుడు మళ్లీ దందా ప్రారంభించారు.

ఇతర రాష్ట్రాల నుంచే కార్యకలాపాలు

కర్ణాటక, తమిళనాడుకు చెందిన పలు మైక్రో ఫైనాన్స్ సంస్థలు(15 వరకు) జిల్లాలో గుట్టుగా లావాదేవీలు సాగిస్తున్నాయి. గ్రామాల్లో బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని వారి సహకారంతో గతంలో సంఘాలుగా ఏర్పడిన వారికి రుణాలు ఇవ్వడం.. ఆ తర్వాత ఎవరు కంతు చెల్లించకపోయినా గ్రూపులోని మిగతా ఆ సభ్యులతో కట్టించడం అలవాటు చేశారు. తాజాగా భూముల పత్రాలు, పాసు పుస్తకాలు సైతం తాకట్టు పెట్టుకొని వ్యక్తిగత రుణాలు ఇస్తున్నారు. రోజు, వారం కంతు అయితే ఒకరకంగా, నెల కంతు అయితే మరో విధంగా వడ్డీ లెక్క కడుతూ... అసలు, వడ్డీ కలిపి 10 నుంచి 12 వారాల్లోనే నిరుపేదల నుంచి 'డబుల్' వసూలు చేస్తున్నారు. రూ.100కు రూ.3 నుంచి రూ.8 వరకు వారి అవసరాలను బట్టి వడ్డీ లాగుతున్నారు. మండల కేంద్రాల్లోని పలు దుకాణదారులకు మైక్రో ఫైనాన్స్ సంస్థలే పెట్టుబడిదారులుగా మారాయి.

రాత్రి పూటే సమావేశాలు

మైక్రో ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులు పల్లెలోని శివారు కాలనీలు, ఎస్సీ కాలనీలు, తండాలను టార్గెట్ చేస్తున్నారు. నిరక్షరాస్యులైన మహిళల అవసరాలు ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ముందుగా ఓ కాలనీలో ఓ వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకుంటారు. వారి ద్వారా మిగతా వారికి 'తక్కువ వడ్డీ' అంటూ వల విసురుతారు. ఆరుగురి నుంచి పది మంది వరకు ఓ గ్రూపు ఏర్పాటు చేసి అవసరాన్ని బట్టి ఒక్కో గ్రూపునకు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణం ఇస్తారు. ప్రధానంగా రాత్రి వేళల్లోనే గ్రూపు సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తారు. అప్పుడే వారి నుంచి రుణ పత్రాలు తీసుకుంటారు. కంతుల చెల్లింపు కూడా రాత్రి వేళల్లోనే ఉంటుంది. అధికారిక లావాదేవీలకు వారు దొరకరు.

నెలకు రూ.70 కోట్లకుపైగానే రుణాలు

జిల్లాలో హిందూపురం, మడకశిర, కదిరి, పెనుకొండ, నియోజకవర్గాలతో పాటు కర్ణాటక సరిహద్దులోని పలు మండలాల్లో మైక్రో ఫైనాన్స్ లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి నెలా కనీసంగా రూ.70 కోట్లకుపైగా టర్నోవర్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

మోసం చేసే కంపెనీలపై చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకుంటాం. ఏ కంపెనీ అయినా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి ఆ తర్వాత వేధించడం తప్పు. ఇది ఆర్థిక నేరాల కిందికి వస్తుంది. వీటివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా చితికి పోతున్నాయి. బాధితులు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే సంబంధిత ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకుంటాం.

– వి.రత్న, ఎస్పీ

ఆర్థిక సహకారం లేక...

గత ప్రభుత్వంలో మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు మంజూరయ్యేవి. ప్రభుత్వం కూడా వివిధ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించేది. అలాగే వీధి, చిరు వ్యాపారులకూ పెట్టుబడికి సాయం దక్కేది. దీంతో వారు రుణాల కోసం ఏ సంస్థనూ ఆశ్రయించే వారు కాదు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక మహిళా సంఘాలకు, చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత కరువైంది. దీంతో వారంతా మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు.

మునిసిపల్ పీఠం కోసం టీడీపీ కుయుక్తులు

- ప్రస్తుత చైర్‌పర్సన్ ఇంద్రజ రాజీనామా
- ఆ స్థానంలో టీడీపీ సభ్యున్ని కూర్చోబెట్టే ఎత్తుగడ



చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసినట్లు చూపుతున్న ఇంద్రజ

హిందూపురం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోగా..ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే హిందూపురం మునిసిపాలిటీలో సంపూర్ణ మెజార్టీతో ఉన్న వైఎస్సార్ సీపీని టార్గెట్ చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు మరో 8 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. తాజాగా మంగళవారం చైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవితో పాటు వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిసి మునిసిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె.. చైర్‌పర్సన్ స్థానంలో కూర్చుని తన రాజీనామా గురించి తెలియజేశారు. అనంతరం రాజీనామా పత్రాన్ని మీడియాకు చూపారు. మూడున్నరేళ్లుగా మునిసిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన తాను.. వ్యక్తిగత కారణాలతో పదవితో పాటు పార్టీకి రాజీనామా చేశానని వెల్లడించారు.

టీడీపీ వారిని చైర్మన్ చేసేందుకు యత్నాలు

గత మునిసిపల్ ఎన్నికల్లో 38 వార్డులున్న హిందూపురంలో 30 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. టీడీపీ ఆరు స్థానాలకే పరిమితమైంది. మరో రెండు స్థానాల్లో ఎంఐఎం, బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక మునిసిపల్ పీఠంపై కన్నేసిన టీడీపీ నేతలు.. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు గాలం వేశారు. ప్రలోభాలకు గురిచేసి సార్వత్రిక ఎన్నికల ముందే ఇద్దరిని, ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో కలసి తొమ్మిది మందిని.. మొత్తం 11 మందిని టీడీపీలో చేర్చుకున్నారు. ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లు కూడా టీడీపీలో చేరారు. దీంతో ప్రస్తుతం టీడీపీకి మద్దతు తెలిపే వారు 19 మంది ఉండగా, ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో చైర్మన్ స్థానం దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే చైర్‌పర్సన్ ఇంద్రజతో బలవంతంగా రాజీనామా చేయించారు. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. టీడీపీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ డీఈ రమేష్ ప్రస్తుతం చైర్మన్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి వద్ద జోరుగా ప్రవహిస్తున్న జయమంగళినది

- అమడగూరులో 99 మి.మీ వర్షపాతం నమోదు

పుట్టపర్తి అర్బన్: జిల్లా రైతన్నను వరుణుడు కరుణించాడు. ఖరీఫ్ పంటలు ఎండుముఖం పట్టిన తరుణంలో విస్తారంగా వర్షించాడు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 32 మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. అత్యధికంగా అమడగూరు మండలంలో 99 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక కదిరి 87.2, రొళ్ల 73.4, చిలమత్తూరు 58.4, నల్లచెరువు 55.6, సోమందేపల్లి 55.4, అగళి 52, ఎన్‌పీ కుంట 50.0, బుక్కపట్నం 48.8, బత్తలపల్లి 39.0, పెనుకొండ 38.8, అమరాపురం 38.6, తనకల్లు 36.4, గోరంట్ల 35.4, మడకశిర 34.6, రొద్దం 34, ముదిగుబ్బ 31.4, కొత్తచెరువు 31.2, గుడిబండ 29.2, ఓడీచెరువు 28.4, ధర్మవరం 26.4, పుట్టపర్తి 25.6, కనగానపల్లి 25.2, లేపాక్షి 24.2, గాండ్లపెంట 19.2, హిందూపురం 18.4, నల్లమాడ 14.0, పరిగి 9.6, తలుపుల 9.4, రామగిరి 9.4, సీకేపల్లి 5.2, తాడిమర్రి మండలంలో 3.8 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాజా వర్షాలతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు కళకళ లాడుతున్నాయి. వాగులు, వంకలు, చెక్‌డ్యాములు జలకళను సంతరించుకున్నాయి.

వసూళ్ల కోసం బాహాబాహీ

ఘర్షణకు దిగిన సెబ్, ఫారెస్ట్ అధికారులు

చిలమత్తూరు: అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన ఫారెస్ట్, సెబ్ అధికారులు వసూళ్లలో వాటాల కోసం బాహాబాహీకి దిగారు. ఒకానొక దశలో భౌతిక దాడులకు సిద్ధమయ్యారు. ఈ సంఘటన మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి సరిహద్దు చెక్‌పోస్ట్‌లో వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి ఫారెస్ట్ అధికారులు కలపతో వెళ్తున్న ఓ వాహనాన్ని నిలిపి తనిఖీలు చేశారు. అనంతరం వాహన డ్రైవర్‌తో మాట్లాడుతున్నారు. ఈ సమయంలో రోడ్డుకు అవతలివైపు ఉన్న సెబ్ చెక్‌పాయింట్‌లో ఉన్న కానిస్టేబుళ్లు వెంకటేష్ నాయక్, రాజగోపాల్ రోడ్డుదాటి ఫారెస్ట్ అధికారుల వద్దకు వచ్చారు. వాహనంలో ఏముంది..మీరేం మంతనాలు చేస్తున్నారంటూ ఫారెస్టు అధికారులను ప్రశ్నించారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఫారెస్టు శాఖ సిబ్బంది ''మా విషయంలో కలుగజేసుకునేందుకు మీకేం పని. అసలు సెబ్ తనిఖీ పాయింట్ అటువైపు ఉంటే...ఇటువైపు ఎందుకు వచ్చారు. మమ్మల్ని ప్రశ్నించేందుకు మీరెవరు'' అంటూ గొడవకు దిగారు. దీంతో సెబ్ పోలీసులు... గంధపు చెక్కల స్మగ్లింగ్ విషయంలో తమకు అనుమానం రావడంతో ఇటువైపు వచ్చామని చెప్పడంతో గొడవ తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో ఇరు పక్షాల మధ్య మాటామాటా పెరిగి భౌతిక దాడుల వరకూ పరిస్థితికి వచ్చింది. బాధ్యతగా మెలగాల్సిన అధికారులు ఇలా బహిరంగంగా ఘర్షణ పడటాన్ని గమనించిన వాహనదారులు ముక్కున వేలేసుకున్నారు.

ఆగని అతిసారం మరణాలు

- రొళ్ల మండలం ఎం.రాయాపురంలో మరో ఇద్దరి మృతి
- గత ఆదివారమే ఒకరు మృతి
- గుడిబండ మండలం కొంకల్లులో ఏడుగురు మృతి చెందిన వైనం
- నియోజకవర్గంలో 10కి చేరిన అతిసారం మృతుల సంఖ్య
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న జిల్లా యంత్రాంగం
- ఇంతవరకూ గ్రామాలవైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
- స్థానికేతరుడిని ఎన్నుకున్నందుకు మూల్యం చెల్లించుకుంటున్నామని జనం ఆవేదన
- అతిసారంపై కనీసం స్పందించని వైద్యఆరోగ్యశాఖ మంత్రి



మృతి చెందిన హనుమంతరాయప్ప(ఫైల్)



గుండిబండ మండలం కొంకల్లులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

మడకశిర/రొళ్ల/గుడిబండ: అతిసారం మృత్యు ఘంటికలు మోగిస్తోంది. రోజుకొకరిని బలి తీసుకుంటోంది. పారిశుధ్య లోపం.. తాగునీరు కలుషితం కావడంతో పల్లెల్లో అతిసారం పాగా వేసింది. అయినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో మరణాలు ఆగడం లేదు. తాజాగా రొళ్ల మండలం ఎం.రాయాపురంలో హనుమంతరాయప్ప(75), పార్వతమ్మ(55) అతిసారంతో మృతి చెందారు. దీంతో నియోజకవర్గంలో అతిసారంతో మృతి చెందిన వారి సంఖ్య పదికి చేరింది.

పైప్‌లైన్లు పగిలి..మురుగు చేరి..

వారం రోజులుగా నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు గ్రామాల్లో తాగునీటి పథకాలకు సంబంధించిన పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా మారాయి. చాలా ప్రాంతాల్లో పైప్‌లైన్లు దెబ్బతిని తాగునీరు కలుషితమైంది. ఇదే అతిసారం సోకడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.



ఎం.రాయాపురంలో ఇంట్లోనే చికిత్స పొందుతున్న చౌడప్ప, కమలమ్మ

10 మందిని బలిగొన్న అతిసారం

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 10 మంది అతిసారం బారిన పడి మృతి చెందారు. గుడిబండ మండలం కొంకల్లులో 10 రోజుల వ్యవధిలోనే తిమ్మక్క(50), లక్ష్మమ్మ(70), సన్నమ్మ(80), యశోదమ్మ(60), బుడ్డ ఓబన్న(85), మల్లికార్జున(50), మరో మహిళ మృతి చెందారు. అదే విధంగా రొళ్ల మండలంలోని ఎం.రాయాపురంలో అతిసారం ప్రబలడంతో రత్నప్ప(63) సోమవారం మృతి చెందారు. అలాగే శిర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతరాయప్ప(75), బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్వతమ్మ(55) మంగళవారం మృతి చెందారు. గ్రామానికే చెందిన తిప్పేస్వామి, పుట్టమ్మ, నరసింహమూర్తి, వెంకటాచారి, నవీన్, నందిని, చౌడప్ప, కమలమ్మ, చన్నప్పతో పాటు మరికొంత మంది అతిసారంతో బాధపడుతూ శిర, మడకశిర, హిందూపురం, తుమకూరు, బెంగళూరు తదిత పట్టణాల్లోని ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

పత్తా లేని ప్రజాప్రతినిధులు

అతిసారంతో వరుస మరణాలు చోటుచేసుకుంటున్నా స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కనీసం ఆయా గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికేతరుడైన రాజును నమ్మి అసెంబ్లీకి పంపినందుకు తమకు తగిన శాస్తి జరిగిందని జనం వాపోతున్నారు. ఇక వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందంటున్నారు. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం... అధికారుల నిర్లక్ష్యంతోనే అతిసారం ప్రబలి ప్రాణనష్టానికి దారి తీసిందంటున్నారు.

పర్యటనలతో సరి

కొంకల్లు, ఎం రాయాపురం గ్రామాల్లో అతిసారం పెద్ద ఎత్తున ప్రబలినా... జిల్లా యంత్రాంగం స్పందన అంతంతమాత్రంగానే ఉంది. అతిసారం మరణాలపై కలెక్టర్ టీఎస్ చేతన్ కనీసం దృష్టి సారించలేదు. వైద్య ఆరోగ్యశాఖ మాత్రం మంగళవారం రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆయా గ్రామాల వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డీఎల్‌పీఓ శివరామకృష్ణ ఆయా గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్య పనులపై సమీక్షించారు. ఇక జేసీ అభిషేక్ కుమార్ మంగళవారం రాత్రి ఎం.రాయాపురం గ్రామాన్ని సందర్శించారు. అతిసారం మృతుల వివరాలు తెలుసుకుని గ్రామంలో పరిస్థితిని సమీక్షించారు.

ఉట్టిపడిన ఒడిశా సాంస్కృతిక వైభవం



సత్యసాయిని కీర్తిస్తూ సామూహిక గానం చేస్తున్న ఒడిశా భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైభవాన్ని చాటుతూ ఒడిశా సత్యసాయి భక్తులు భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఒడిశా భక్తులు మంగళవారం ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం లక్షార్చన, సత్యసాయి స్తుతిగానం నిర్వహించారు. సామూహికంగా సత్యసాయి నామాన్ని స్మరించారు. సాయంత్రం ఒడిశా జానపద నృత్య వైభవాన్ని చాటుతూ సంబల్‌పూర్ జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. సత్యసాయి సేవా కార్యక్రమాలను, ఆయన ఆధ్యాత్మిక బోధనలను వివరిస్తూ 'డివైన్ డాట్స్' పేరుతో నాటిక ప్రదర్శించారు. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న భక్తులు



డివైన్ డాట్స్ నాటికలోని ఓ ఘట్టం

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు రామాంజి

పరిగి: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం ఊటుకూరుకు చెందిన రామాంజి (48), తన మిత్రుడు బోయ ఈశ్వర్‌తో కలసి మెదా గ్రామంలో నివాసముంటున్న సోదరితో రాఖీ కట్టించుకునేందుకు సోమవారం వచ్చాడు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు పెద్దిరెడ్డిపల్లి సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో రామాంజి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం


వెంకటరమణ (ఫైల్)

కదిరి అర్బన్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం ఎరుకులవాండ్లపల్లికి చెందిన వెంకటరమణ (60) ఓ ప్రైవేట్ స్కూల్‌లో పశువుల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి స్కూల్ నుంచి ఇంటికి వెళుతున్న ఆయనను జాతీయ రహదారిపై అనంతపురం వైపుగా వెళుతున్న వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న కదిరి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ: స్థానిక భద్రప్ప బావి వద్ద ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు... వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని అద్దె ఇంట్లో నివాసముంటున్న ఒంటరి మహిళ వాణి వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. విషయాన్ని గమనించిన దుండగులు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి నగదు, బంగారు నగలు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం విషయాన్ని గుర్తించిన పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హైదరాబాద్‌లో ఉన్న వాణితో ఫోన్‌లో మాట్లాడారు. బీరువాలో 10 తులాల బంగారంతో పాటు రూ.2లక్షల నగదు ఉన్నట్లు ఆమె ఫోన్‌లో తెలిపింది. బాధితురాలు వచ్చి ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని సీఐ సురేష్‌బాబు పేర్కొన్నారు.

లింకు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!



- భారీగా పెరిగిన సైబర్ నేరాలు
- క్రెడిట్ కార్డు పేరుతో వరుస మోసాలు
- మొబైల్‌కు లింకులు పంపుతూ టోకరా
- పోలీసులను ఆశ్రయిస్తోన్న బాధితులు

సాక్షి, పుట్టపర్తి

- ధర్మవరానికి చెందిన ఓ చీరల వ్యాపారికి పది రోజుల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను విజయవాడ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన అపరిచితుడు...'మీరు నగదు లావాదేవీలు ఎక్కువగా చేస్తున్నారు. మీకు రూ.10 లక్షల వరకు క్రెడిట్ కార్డు ఆఫర్ ఉంది' అంటూ మాట కలిపాడు. దీంతో చీరల వ్యాపారి... అయితే కార్డు పంపండి అని చెప్పగానే... వాట్సాప్‌కు ఓ లింక్ పంపించాడు. అందులో నాలుగైదు స్టెప్స్ ఉంటాయని.. రెండు నిమిషాల్లో ప్రాసెస్ చేస్తే.. వారం రోజుల్లో క్రెడిట్ కార్డు పంపుతామని నమ్మబలికాడు. ప్రాసెసింగ్ ఫీజు కింద నామినల్‌గా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దీంతో చీరల వ్యాపారి అతను చెప్పినట్లు చేయగా.. ఖాతాలోని రూ.46 వేలు మాయమైంది.
- పుట్టపర్తికి చెందిన 32 ఏళ్ల నిరుద్యోగికి నెల క్రితం ఓ ఫోన్ వచ్చింది. తాను విశాఖపట్నం నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పుకున్న అపరిచితుడు... డిగ్రీ ఆధారంగా నెలకు రూ.25 వేల వేతనంతో ఉద్యోగం ఇస్తామని నమ్మబలికాడు. కాకపోతే మూడు నెలల జీతం తమకు డిపాజిట్ చేయాలని చెప్పాడు. అది నిజమని నమ్మిన నిరుద్యోగి సరే అనగానే అతని సెల్‌కు ఓ లింక్ పంపాడు. ఆ లింక్ ఓపెన్ చేసి వివరాలు నింపగానే నిరుద్యోగి ఖాతా నుంచి రూ.75 వేలు మాయమైంది. డిపాజిట్‌గా తీసుకున్నారేమోనని అనుకున్న సదరు యువకుడు ఆఫర్ లెటర్ కోసం పది రోజుల వరకు వేచి చూశాడు. ఆ తర్వాత సదరు నంబర్‌కు ఫోన్ చేయగా.. అది స్విచాఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయినట్లు బాధితుడు తెలుసుకున్నాడు.

...ఇలా పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, కదిరి ప్రాంతాల్లోని చాలా మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతున్నారు. జిల్లా పరిధిలో 2024 ఆరంభం నుంచి ఇప్పటి వరకు 86 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. అయితే మోసపోయిన చాలా మంది బయటకు తెలిస్తే నవ్వులపాలవుతామని భావించి ఫిర్యాదు చేయడం లేదు. అవి కూడా పోలీసు రికార్డులకెక్కితే సైబర్ నేరాల సంఖ్య వందల్లో ఉంటుంది.

బ్యాంకులో ఖాతా ఉంటే చాలు..సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ఉద్యోగం.. క్రెడిట్ కార్డు, ఉచిత బహుమతులతో వల వేస్తున్నారు. ఆశ పడి వారు చెప్పినట్లు చేసిన వారు నిండా మునిగిపోతున్నారు. ఆ తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా చదువుకునే వారు ఉంటున్నారు. ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డు పేరుతో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి. రూ.లక్షల్లో లిమిట్ ఇస్తామని సైబర్ నేరగాళ్లు ఆశచూపుతుండగా... చదువుకున్న యువత లింక్ క్లిక్ చేస్తూ బ్యాంకు ఖాతా ఖాళీ చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల వరుసగా వెలుగు చూస్తున్నాయి. డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న క్రమంలో సైబర్ నేరాలు కూడా క్రమక్రంగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు చిరు వ్యాపారులు, కూలీలు, రైతులు, కార్మికుల బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మును ఇంట్లో దాచుకుంటే దొంగలు పడుతారని.. బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంటే.. సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు.

లింక్ పంపి.. మోసం చేసి..

ప్రస్తుత కాలంలో చాలామంది విలాసాలకు అలవాటు పడ్డారు. అంతేకాకుండా సులువుగా డబ్బు సంపాదించాలనే క్రమంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అమాయకులను టార్గెట్ చేసుకుని.. ఫోన్ చేసి మాయ మాటలు చెబుతున్నారు. నమ్మకం కలిగేలా మాట్లాడుతూ.. క్రెడిట్ కార్డు లేదా బ్యాంక్‌లోన్‌లేదా మరో సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలుకుతారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో లింక్ పంపుతారు. ఫోన్‌లో మాట్లాడుతూనే.. లింక్ ఓపెన్ చేయించి.. నిమిషాల వ్యవధిలోనే ఓటీపీ నంబర్లు తీసుకుంటున్నారు. అనంతరం ఒక ట్రెండు సెకన్లలో బ్యాంకు ఖాతా ఖాళీ అయినట్లు బాధితులకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఆ తర్వాత బాధితులు తమకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తోంది.

అవగాహన కల్పిస్తున్నా.. మారని తీరు

సైబర్ మోసాలతో మారుమూల పల్లెల వరకు అవగాహన కల్పిస్తున్నారు. ఒకరు మోసపోతే.. ఆ గ్రామం మొత్తానికి తెలుస్తుంది. కానీ ప్రజలు స్వార్థపరులుగా ఆలోచిస్తూ.. తేలుకుట్టిన దొంగల్లా ఉంటున్నారు. దీంతో ఒకరికి తెలియకుండా మరొకరు మోసపోతున్నారు. జిల్లా పోలీసులు ప్రతి స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. నేరాలు జరుగుతున్న తీరు, నేరగాళ్ల అనుసరిస్తున్న విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా తెలియజేస్తున్నా.. నేరాలు నియంత్రణలోకి రావడం లేదు.

డిజిటల్‌కు అలవాటు పడటంతోనే..

నగదు రహిత లావాదేవీలకు చాలామంది అలవాటు పడ్డారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లకు మంచి అవకాశం ఇస్తున్నారు. టీ తాగినా.. టిఫిన్ తిన్నా.. స్నేహితుడికి డబ్బు పంపాలన్నా.. ఎడాపెడా క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేస్తున్నారు. ఇదే క్రమంలో నగదు లావాదేవీలన్నీ.. ఆన్‌లైన్‌కే పరిమితం చేస్తున్నారు. ఫలితంగా క్రెడిట్ కార్డు, ఉద్యోగాలు, వర్క్ ఫ్రం హోమ్ అనగానే వెంటనే నమ్ముతున్నారు. ఆధార్‌కు మొబైల్ నంబరు లింక్ అయి ఉంటున్న నేపథ్యంలో ఈజీగా మోసపోతున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష



ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను నియంత్రించడం వంద శాతం సాధ్యం అవుతుంది. ఎవరైనా అధిక డబ్బు ఆశ చూపితే నమ్మి మోసపోవద్దు. క్రెడిట్ కార్డులు కావాలంటే నేరుగా బ్యాంకులకు వెళ్లి తెచ్చుకోండి. ఆన్‌లైన్‌ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే వెంటనే నమ్మకండి. బ్యాంకు ఖాతాల వివరాలు.. ఓటీపీలు ఎవరికీ షేర్ చేయొద్దు. సైబర్ నేరాలపై ఎలాంటి అనుమానం వచ్చినా.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. – వి.రత్న, ఎస్పీ

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: 'కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం –2024'కు కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏటా ఉత్తమ రచనలకు కవి సమ్మేళనం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాదికి సంబంధించి కవితా సంపుటాలను 'కొత్తపల్లి సురేష్, డోర్.నం. 33–129–1, ఓటీఆర్ కాలనీ, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలన్నారు. గతేడాది ప్రచురితమైన కవితా సంపుటాలను మాత్రమే పోటీలకు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94938 32470లో సంప్రదించాలని కోరారు.

22న సైనిక సంక్షేమ శాఖలో గ్రీవెన్స్

అనంతపురం కార్పొరేషన్: మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎ.తిమ్మప్ప మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న గ్రీవెన్స్‌ను ఉమ్మడి జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెనరా బ్యాంక్ ఎదుట మహిళల ఆందోళన


బ్యాంక్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించిన మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక అనంతపురం రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్ (సిండికేట్) శాఖ వద్ద సోమవారం మహిళా సంఘాల సభ్యులు ధర్నా చేపట్టారు. బ్యాంక్‌ను మూసివేసి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో 21 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి యానిమేటర్‌గా వ్యవహరిస్తున్నా.. మొత్తం పనులను ఆమె భర్త ఎర్రిస్వామి చక్కబెట్టేవాడన్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాలకు చెందిన సుమారు రూ.60 లక్షలకు పైగా నగదును ఎర్రిస్వామి దోచేశాడని మండిపడ్డారు. బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే ఈ అక్రమాలకు ఎర్రిస్వామి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇదే అంశంపై గతంలో బ్యాంక్ సిబ్బందిని నిలదీశామని, మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొంతన లేని సమాధానాలతో మోసగాడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని నచ్చచెప్పి ఫిర్యాదు స్వీకరించిన అనంతరం ఆందోళనను విరమించారు.

డ్రిప్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక కంబదూరు రోడ్డులో ఉన్న కిసాన్ డ్రిప్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రైతుల నుంచి అత్యధిక మోతాదులో కొనుగోలు చేసిన స్క్రాప్ డ్రిప్ పైపులను ఫ్యాక్టరీ సమీపంలో నిర్వాహకులు డంప్ చేసి ఉంచారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టాయి. నిర్వాహకుడు సాయికుమార్ సమాచారమివ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఈలోపు రూ.22 లక్షలకు పైగా విలువైన దాదాపు 40 టన్నుల డ్రిప్ స్క్రాప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.80 లక్షల విలువైన డ్రిప్ పైపులను కాపాడినట్లు ఫైర్ అధికారి వసంత్‌నాయక్ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రవిబాబు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

2.80 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురు విక్రేతల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గోరంట్ల: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 2.80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన గోరంట్ల సీఐ శేఖర్, సిబ్బందితో కలసి గుమ్మయ్యగారిపల్లి సమీపంలో తనిఖీలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసులను చూసి కొందరు వ్యక్తులు పరుగు తీయడంతో అనుమానం వచ్చి వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. విచారణలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా నిర్ధారణ అయింది. దీంతో వారి నుంచి 2.80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో గోరంట్ల రాజీవ్‌కాలనీకి చెందిన షేక్ అఫ్రోజ్, మార్కెట్ వీధికి చెందిన షేక్ జునైద్, మహమ్మద్ రిజ్వాన్ ఖాన్, మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ ఉన్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలకు తెరదీసినట్లుగా నిర్ధారణ అయింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

మేకల కాపరి హత్య

- 14మేకల అపహరణ


జయమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: మేకలు కాసేందుకు వెళ్లిన మహిళను హతమార్చి జీవాలను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మండలం మలుగూరు గ్రామానికి చెందిన జయమ్మ(56) మేకల పోషణతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం తనకున్న 26 మేకలను మేపు కోసం సమీపంలోని పొలాల్లోకి తోలుకెళ్లింది. సాయంత్రం 12 మేకలు మాత్రం ఇంటికి చేరుకున్నాయి. జయమ్మ, మిగిలిన మేకల జాడ తెలియరాలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం రాత్రి బాధిత కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని జయమ్మ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం జయమ్మ మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐ జనార్దన్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. జయమ్మ గొంతుకు వైర్ వేసి వెనుక నుంచి బలంగా లాగి బిగించి హత్య చేసి, 14 మేకలు అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. క్లూస్‌టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. జయమ్మ హత్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. స్నిఫర్ డాగ్ సాయంతో దుండగుల ఆనవాళ్లు గుర్తించామన్నారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు ఐదు బృందాలను రంగంలో దించినట్లు తెలిపారు.

సర్దుబాటును అడ్డుకున్న ఉపాధ్యాయులు


పెనుకొండ: స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం సాయంత్రం చేపట్టిన టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పలువురు ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. కార్యాలయంలో పని సర్దుబాటు అంశంపై అధికారులు చర్చిస్తుండగా ఉపాధ్యాయులు అభ్యంతరం తెలిపారు. అశాస్త్రీయ విధానాలు అవలంభిస్తూ సర్దుబాటు ప్రక్రియను కొనసాగిస్తామంటే ఒప్పుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌టీఏ నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- ఎన్పీకుంట: ఉపాధ్యాయుల సమ్మతికి విరుద్ధంగా చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపేయాలంటూ ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో చేపట్టిన సర్దుబాటు ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమ్మతికి విరుద్ధంగా సర్దుబాటు చేస్తున్నారని మండిపడ్డారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత అంటూనే ఎస్జీటీలకు ఇష్టం లేకున్నా బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయించడం సరి కాదన్నారు. తప్పుల తడకగా కొనసాగిస్తున్నమ సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపి, తప్పిదాలను పూర్తిగా సరిదిద్దిన తర్వాతనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

15 తులాల బంగారం, నగదు అపహరణ

తాడిపత్రి రూరల్: స్థానిక గన్నెవారిపల్లి కాలనీలోని బాలాజీ గార్డెన్‌లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవరాలిని పిలుచుకుని వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి రైతు దస్తగిరిరెడ్డి బెంగళూరులోని ఆస్పత్రికి భార్యతో కలసి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన బంధువుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బెంగళూరులోని దస్తగిరిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. బీరువాలో 15 తులాల బంగారం, నగదు ఉన్నట్లుగా ఆయన ద్వారా తెలుసుకున్న పోలీసులు అవి లేకపోవడాన్ని నిర్ధారించారు. ఇంటి యజమాని వచ్చిన తర్వాత ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

బాలల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సాయిసదన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి

హిందూపురం టౌన్: బాలల రక్షణ గృహాల్లో బాలల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి ఆదేశించారు. పట్టణంలోని నిర్వహిస్తున్న బాలల రక్షణ గృహాలు, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గృహాలు, జూనియర్ జస్టిస్ యాక్ట్ ప్రకారం లైసెన్సులు పొందిన వసతి గృహాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం, శ్రీసత్యసాయిసేవాసదన్ బాలుర వసతి గృహాలను పరిశీలించారు. రికార్డులను, పిల్లలకు అందిస్తున్న భోజన వసతి సౌకర్యాలను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల వసతి గృహాల తనిఖీ చేపట్టామన్నారు. పరిశీలించిన అంశాలను కలెక్టర్‌కు, రాష్ట్ర సంబంధిత ప్రభుత్వ శాఖకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, డీసీపీఓ, పీఓలు, స్థానిక చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారం తిని ఒకరి మృతి

- 20 మందికి అస్వస్థత


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: పెళ్లిలో విందు భోజనం తిన్న 20 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రి పాలయ్యారు. వీరిలో ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు... మూడు రోజుల క్రితం శ్రీరంగపురం తండాలో పెళ్లి వేడుకలో అదే గ్రామానికి చెందిన వారితో పాటు నాగేనహళ్లి తండా వాసులూ పాల్గొన్నారు. వేడుక అనంతరం అందరూ కలసి భోజనం చేశారు. ఆ మరుసటి రోజే నాగేనహళ్లి తండా వాసులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కొందరిని సమీపంలోని తిరుమణి పీహెచ్‌సీకి, మరికొందరిని పావగడ, హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రులతో పాటు బెంగుళూరులోని విక్టోరియా ఆస్పత్రికీ తరలించారు. వీరిలో నాగేనహళ్లి తండాకు చెందిన రామిబాయి (70) తుమకూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మధుగిరి ఏసీ గోటూరి శివప్ప, స్థానిక తహసీల్దార్ వరదరాజు, టీపీఎస్ ఈఓ జానకీరాం, టీహెచ్ఓ డాక్టర్ కిరణ్ ఆయా గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ సైతం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యాధికారులకు సూచించారు. కాగా, పరిస్థితి ఫుడ్‌పాయిజన్ వల్లనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు వైద్యులు అభిప్రాయపడ్డారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత మణిపూర్



ఫుట్‌బాల్ చాంపియన్స్ ట్రోఫీతో మణిపూర్ జట్టు క్రీడాకారులు



రన్నర్స్ ట్రోఫీతో జార్ఖండ్ జట్టు

అనంతపురం కార్పొరేషన్: జూనియర్ గరల్స్ నేషనల్ టైర్ –1 ఫుట్‌బాల్ చాంపియన్‌గా మణిపూర్ జట్టు నిలిచింది. మంగళవారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో మణిపూర్, జార్ఖండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 2–0 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టు గెలిచింది. ఆట ప్రారంభం ఉంచి మణిపూర్ క్రీడాకారిణులు దూకుడు ప్రదర్శిస్తూ వచ్చారు. ప్రత్యర్థి జట్టుకు గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా చేశారు. 36వ నిమిషంలో మెనియా, 65వ నిమిషంలో రెమీ చెరో గోల్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఫైనల్‌లో నెగ్గిన మణిపూర్ క్రీడాకారుల ఈలలు, కేకలతో స్టేడియం మార్మోగింది.

ఫుట్‌బాల్‌కు పెరిగిన ఆదరణ

ఫుట్‌బాల్‌కు మంచి ఆదరణ లభిస్తోందని ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. మంగళవారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విజేత, రన్నర్ జట్ల క్రీడాకారులను అభినందిస్తూ ట్రోఫీలను అందజేసి, మాట్లాడారు. క్రీడాభివృద్ధికి ఆర్డీటీ తీసుకున్న చర్యలను వివరించారు. అనంతపురంలో జాతీయ స్థాయి టోర్నీ జరగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, కడప కార్యదర్శి ఎం సుధీర్, అనంతపురం కార్యదర్శి డి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.